సాక్షి ఖమ్మం

శనివారం । 8 । జూన్ । 2024



ఎమ్మెల్సీగా మల్లన్న
ఉత్కంఠగా సాగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ బలపర్చిన తీన్మార్ మల్లన్న విజయం సాధించారు. 8లో



ఎండలు తగ్గినా తీయలేదు..
వేసవిలో ఉపాధి హామీ కూలీలకు ఇచ్చేందుకు సమకూర్చిన ఓఆర్ఎస్ ప్యాకెట్లు డీఆర్‌డీఏ కార్యాలయంలోనే మూలుగుతున్నాయి. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
35° / 25°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రత ప్రభావం తక్కువగానే ఉంటుంది. సాయంత్రం తర్వాత వాతావరణం మరింత చల్లబడుతుంది.

రైతులకు అండగా 'సాక్షి'

జిల్లా వ్యవసాయాధికారితో నేడు 'ఫోన్ ఇన్'



ఎం.విజయనిర్మల

ఖమ్మం వ్యవసాయం: వానాకాలం పంటల సాగుకు సమయం ఆసన్నమైంది. ఈ నేపథ్యాన ఏ పంటలు సాగు చేస్తే మంచిది, ఎలాంటి విత్తనాలు ఎంచుకోవాలి, విత్తనాలు నాటడానికి ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నకిలీ విత్తనాల బారి నుంచి కాపాడుకోవడం ఎలా తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని 'సాక్షి' సంకల్పించింది. ఈమేరకు నేడు ఫోన్ ఇన్ ఏర్పాటుచేయగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయనిర్మల రైతుల సందేహాలకు సమాధానాలు ఇస్తారు. వానాకాలంలో సాగు చేసే పంటలు, అనువైన విత్తనాలు, విత్తనాల లభ్యత, ఎరువుల వినియోగం తదితర అంశాలపై రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

తేదీ : 08 - 06 - 2024, శనివారం
సమయం : ఉదయం 9నుంచి 10 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్
72888 94200

న్యూస్‌రీల్

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్య



కొదుమూరులో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ శర్మ

చింతకాని: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఉత్తమ విద్య అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ కోరారు. మండలంలోని కొదుమూరు, వందనంలో శుక్రవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నందున ఉచిత విద్య అందడంతో పాటు యూనిఫాం, పుస్తకాలు అందించడమే కాక మధ్యాహ్న భోజనం అమలవుతోందని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలోని పలువురి ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వివరించి పిల్లలను చేర్పించాలని కోరారు. అమ్మ ఆదర్శ పాఠశాల సభ్యులు నాగమణి, అరుణజ్యోతి, హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే డీలర్లపై చర్యలు



విత్తనాల కోసం వచ్చిన రైతుతో మాట్లాడుతున్న డీఏఓ విజయనిర్మల

కొణిజర్ల: విత్తనాల డీలర్లు నిబంధనలు అతిక్రమించినట్లే తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల హెచ్చరించారు. మండలంలోని తనికెళ్లలో పలు దుకాణాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఏఓ రైతులతో మాట్లాడి విత్తనాల లభ్యత, ధరలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విత్తన దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్ నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, ప్రతీ రైతుకు పూర్తి వివరాలతో బిల్లు ఇవ్వాలని సూచించారు. కాగా, రైతులు దిగుబడి పేరుతో ఒకే రకం కాకుండా రెండు, మూడు రకాలు విత్తుకుంటే నష్టాలు ఎదురుకావని చెప్పారు. వైరా ఏడీఏ కరుణశ్రీ, ఏఓ బాలాజీ పాల్గొన్నారు.

నూతన క్రిటికల్ కేర్ భవనానికి రూ.13కోట్లు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ విభాగం నూతన భవన నిర్మాణానికి రూ.13కోట్లు మంజూరయ్యాయి. ఆస్పత్రిలోని పాత భవనంలో కార్యాలయంతో పాటు ఇతర విభాగాలు కొనసాగుతున్నాయి. అయితే, భవనం శిథిలావస్థకు చేరడంతో ఆ స్థానంలో క్రిటికల్ కేర్ సెంటర్ నిర్మించాలని నిర్ణయించగా నిధులు కేటాయించారు. ఈనేపథ్యాన శుక్రవారం టీఎస్ఎంఎస్ఐడీసీ ఈఈ ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, ఆర్ఎంఓలు అమర్‌సింగ్, రాథోడ్ పరిశీలించారు. నిర్మాణ పనులను ఏడాదిలోగా పూర్తిచేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిసింది.

ఆశల సాగు..



రఘునాథపాలెం మండలం జింకలతండాలో దుక్కి దున్నుతున్న రైతులు



మంచుకొండలో పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు



పత్తి విత్తనం నాటుతున్న మహిళ

రుతుపవనాలు ప్రవేశించడంతో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఇంకా వర్షాలు జోరందుకోనప్పటికీ రైతులు వ్యవసాయ పనులు మొదలుపెట్టారు. కొన్నిచోట్ల దుక్కులు దున్నుతుండగా.. గత నెల చివరి వారంలోనే దుక్కులు దున్నిన రైతులు పత్తి విత్తనాలు నాటడంలో నిమగ్నమయ్యారు. దీంతో కూలీలకు మళ్లీ చేతి నిండా పని లభిస్తుండడంతో వ్యవసాయ క్షేత్రాల్లో సందడి నెలకొంటోంది. అయితే, సరిపడా వర్షపాతం నమోదై, భూమి పదునెక్కితే సాగు పనులు మరింత ఊపందుకోనున్నాయి. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

తినాలా.. వద్దా ?

ప్రమాదంలో ప్రజారోగ్యం
- ఉమ్మడి జిల్లాలోని హోటళ్లలో నాణ్యత లేని ఆహారం
- రోజుల తరబడి నిల్వ
- పురుగులు పడినా పట్టించుకోని నిర్వాహకులు
- ఫిర్యాదు వస్తేనే కదులుతున్న అధికారులు.. ఆపై నోటీసులతో సరి



ఖమ్మంలోని ఓ రెస్టారెంట్‌లో తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: మసాలా ఘుమఘుమలు, పైపై మెరుగులతో హోటళ్లలో వడ్డిస్తున్న ఆహారంలో నాణ్యతపై నీలినీడలు కమ్ముకున్నాయి. రోజుల తరబడి ఆహార పదార్థాలను నిల్వ చేసి.. మళ్లీ మెరుగులు దిద్ది వడ్డిస్తున్నట్లు ఇటీవల ఉమ్మడి జిల్లాలోని పలు హోటళ్లలో చేసిన తనిఖీల్లో బయటపడింది. రుచికరమైన వంటల మాటున హోటళ్లు చేస్తున్న దగా బయటపడుతుండడంతో నివ్వెరపోతుండడం అధికారుల వంతవుతోంది. అయితే ఫిర్యాదు అందితేనే తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆతర్వాత పట్టించుకోకపోవడంతో హోటళ్లకు వెళ్లాలంటేనే జంకాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. తనిఖీలు చేయడానికి సరిపడా యంత్రాంగం లేకపోవడం ఒక కారణమైతే.. ఉన్న అధికారులు సైతం పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తుండడం హోటళ్ల యజమానులకు కలిసొస్తోంది.

ఎలా ఉంటే మాకేంటి ?

ఇటీవల ఖమ్మంలోని మూడు, భద్రాచలంలో మూడు రెస్టారెంట్లలో అధికారులు తనిఖీ చేయగా.. రోజుల తరబడి రిఫ్రిజిరేటర్లలో నిల్వ చేసిన ఆహార పదార్థాలు బూజు పట్టిన స్థితిలో కనిపించాయి. అంతేకాక గడువు తీరిన మసాలా దినుసులు, పిండిని గుర్తించారు. పిల్లల నుంచి పెద్దల వరకు ఇష్టంగా తినే ఐస్‌క్రీమ్‌కు బూజు వచ్చినా నిల్వ చేసినట్లు తేలింది. ఇక హోటళ్లలోని వంటశాలల పరిస్థితి ఎంత తక్కువగా చెబితే అంత మంచిదనే స్థాయిలో కనిపించాయి. లాభార్జనే ధ్యేయంగా భావిస్తున్న హోటళ్ల యజమానులు నిబంధనలు పాటించకుండా ఆహారానికి పైపై మెరుగులద్ది వడ్డిస్తున్నట్లు గుర్తించిన అధికారులు నిర్వాహకులు నోటీసులు ఇచ్చారు. యాజమాన్యాలపై త్వరలోనే 4ఏ కేసు నమోదు చేసి జాయింట్ కలెక్టర్ కోర్టులో హాజరు పర్చనున్నట్లు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో హోటళ్లు, రెస్టారెంట్ల వివరాలు..		
జిల్లా	బార్ అండ్ రెస్టారెంట్లు	హోటళ్లు
ఖమ్మం	58	520
కొత్తగూడెం	42	420

పైపై మెరుగులే

ఉమ్మడి జిల్లాలోని చిన్న రెస్టారెంట్లతోపాటు పెద్ద హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లను చూస్తే సిట్టింగ్, మిరుమిట్లు కొలిపే విద్యుత్ లైట్లతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. కానీ పరిశుభ్రంగా ఉండాల్సిన కిచెన్ అందుకు విరుద్ధంగా ఉండగా... సిబ్బంది, వంట మాస్టర్లు కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. దీంతో కొన్ని రెస్టారెంట్లలో ఆహారం ఆరుబయటే వండుతుండగా.. ఈగలు, కీటకాలు ఆహార పదార్థాల్లో చేరుతున్నాయి.

అనుమతి తప్పనిసరి..

రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాలు, కర్రీ పాయింట్లకు రిజిస్ట్రేషన్ చేయించుకోవడమే కాక ఆహార భద్రత అధికారి నుంచి అనుమతి పొందాలి. ఇక అధికారుల తనిఖీల్లో అనుమతి లేనట్లు బయటపడితే నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అయినా అదే తీరు కొనసాగితే కేంద్రాలను సీజ్ చేసి కేసులు నమోదు చేసి జరిమానా విధించాలి. అంతేకాక ఏడాదికోసారి నిర్ణీత సంఖ్యలో నమూనాలు సేకరించి ల్యాబ్‌లకు పంపాలి. అయితే ఈ నిబంధనలన్నీ కాగితాలకే పరిమితం కాగా.. అధికారులు తనిఖీల మాట ఎత్తడం లేదు. ఖమ్మం నగరంలో వెయ్యికి పైగా తోపుడు బండ్లు ఉండగా.. 500 మంది నిర్వాహకులకు మాత్రమే ఫుడ్ సేఫ్టీ అధికారులు శిక్షణ ఇచ్చారు. మిగతా వారికి శిక్షణ ఇవ్వాల్సి ఉన్నా ఎప్పుడు జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

పర్యవేక్షణ కరువు

ఇటీవల ఫుడ్ సేఫ్టీ అధికారులు జరిపిన తనిఖీల్లో హోటళ్ల నిర్వహణలో అనేక లోపాలు బయటపడ్డాయి. అయితే క్రమం తప్పకుండా దాడులు నిర్వహించాల్సిన అధికారులు ఫిర్యాదు వచ్చినప్పుడే ఒకటి, రెండు హోటళ్లకు వెళ్లి ఆతర్వాత చేతులు దులిపేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం నెలకు పది రెస్టారెంట్లలో తనిఖీ చేసి ఆహార పదార్థాల శాంపిళ్లు సేకరించాలి. కానీ ఆ మేరకు తనిఖీలు జరగకపోవడానికి శాఖలో సిబ్బంది కొరతను సాకుగా చెబుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఒక అసిస్టెంట్ కమిషనర్, ఖమ్మం జిల్లాలో ఒక గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఒక ఫుడ్ ఇన్‌స్పెక్టర్, క్లర్క్, ఇద్దరు అటెండర్లు, కొత్తగూడెం జిల్లాలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్, అటెండర్ విధులు నిర్వర్తించాలి. అయితే, ఉమ్మడి జిల్లా అంతటికీ ఒకే గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, క్లర్క్, అటెండర్ మాత్రమే కొనసాగుతుండడం ప్రజల ప్రాణాల మీదకు తీసుకొస్తోంది.

సమ, సత్వర న్యాయం

- రాజీ పడదగిన కేసుల పరిష్కారమే లక్ష్యంగా లోక్‌అదాలత్
- కక్షిదారులకు డబ్బు, సమయం ఆదా

నేడు జాతీయ లోక్ అదాలత్



లోక్‌అదాలత్‌పై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా జడ్జి రాజగోపాల్ (ఫైల్)

ఖమ్మంలీగల్: కోర్టుల్లో కేసుల పరిష్కారంలో జాప్యాన్ని నివారించి.. కక్షిదారులకు సమ, సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నారు. సాధారణంగా కోర్టుల ద్వారా న్యాయం పొందడంలో ఆలస్యం జరుగుతుండడంతో పెండింగ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. వీటి పరిష్కారానికి ఉన్నత న్యాయస్థానం ప్రత్యామ్నాయ పరిష్కార మార్గంగా లోక్ అదాలత్‌ను ప్రవేశపెట్టింది. కాలయాపన లేకుండా కేసులను సత్వరం పరిష్కరించడానికి న్యాయ సేవాధికార చట్టాన్ని రూపొందించి కక్షిదారుల విలువైన సమయం, డబ్బు వృథా కాకుండా శాశ్వత, అంతిమ పరిష్కారాన్ని లోక్ అదాలత్‌ల ద్వారా అందిస్తున్నారు.

పేదలకు న్యాయం అందించడమే లక్ష్యం

పేదలకు న్యాయసాయం అందించే ఉద్దేశంతో ప్రభుత్వం 1987లో న్యాయసేవాధికార చట్టాన్ని ప్రవేశపెట్టింది. కేవలం డబ్బు ఉన్న వారికే న్యాయం సొంతమనే అపోహను తొలగించేందుకు ఈ చట్టాన్ని తీసుకురాగా, న్యాయ విజ్ఞాన సదస్సులు, కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నారు. ప్రీ లిటిగేషన్ కేసుల ద్వారా ఎక్కువ శాతం కేసులు విచారణకు ముందే లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కారమవుతున్నాయి. ఇక రాజ్యాంగం కల్పించిన చట్టం, న్యాయాలను గ్రామీణ ప్రాంత ప్రజలకు అందించేందుకు న్యాయసేవా సంస్థలు అవతరించాయి. ఆర్థిక అసమానతలను తొలగించి, సత్వరన్యాయం అందించడమే ధ్యేయంగా లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నారు. 'ప్రత్యామ్నాయ పరిష్కార పద్ధతి' అనే సూత్రాన్ని అనుసరించి ప్రభుత్వం ప్రజా న్యాయపీఠం(లోక్ అదాలత్) ప్రక్రియను చట్టరీత్యా ప్రవేశపెట్టింది. తద్వారా ఉభయులకు నచ్చ చెప్పి వారి సమ్మతితో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తారు. ఫలితంగా ఏ పౌరుడు కూడా ఆర్థిక కారణాలు, ఇతర అంశాలతో న్యాయాన్ని పొందే అవకాశం కోల్పోకుండా ఉచిత న్యాయ సాయం సైతం అందిస్తున్నారు.

సమస్యల పరిష్కారం ఇలా..

లోక్ అదాలత్‌లో పంపించిన ప్రతీ కేసులో వెంటనే ఉభయ వర్గాల మధ్య రాజీ కుదిర్చి తగాదాలను పరిష్కరించాల్సి ఉంటుంది. ఈ పరిష్కారంలో లోక్ అదాలత్‌లు మనస్ఫూర్తిగా, శాయశక్తులా సాధ్యమైనంత మేరకు ప్రయత్నాలు చేయాలి. ఇందులో కేసు పరిష్కారమైతే చెల్లించిన కోర్టు ఫీజును సైతం తిరిగి పొందే అవకాశముంది. ఆపై జారీ చేసిన అవార్డు తుది తీర్పు కావడమే కాక అప్పీల్‌కు సైతం అవకాశముండదు. అయితే, ఇరువర్గాల మధ్య రాజీ కుదరని పక్షంలో దావాలను తిరిగి సదరు కోర్టుకు పంపాల్సి ఉంటుంది.

2023, 2024లో లోక్‌అదాలత్ ద్వారా పరిష్కారమైన కేసులు	
లోక్ అదాలత్	పరిష్కారమైన కేసులు
ఫిబ్రవరి 2023	8,046
సెప్టెంబర్ 2023	17,718
జూన్ 2023	7,880
డిసెంబర్ 2023	19,303
మార్చి 2024	7,665
మొత్తం	60,612

అపరిష్కృత కేసులు పరిష్కరించుకోండి



కోర్టుల్లో అపరిష్కృతంగా ఉన్న కేసులు పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ చక్కని వేదిక. తక్కువ వ్యవధిలో ఖర్చు లేకుండా పరిష్కరించుకోవచ్చు. అలాగే కక్షిదారులు చెల్లించిన కోర్టు ఫీజు కూడా తిరిగి పొందొచ్చు. సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో ఉన్న కేసులను కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే వీలుంది. సైబర్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చు.

– జి.రాజగోపాల్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్

రాజీమార్గంతో శాంతి, సామరస్యాలు

లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీమార్గంలో పరిష్కరిస్తే అది సమాజంలో శాంతిసామరస్యాలను పెంచుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ తెలిపారు. న్యాయాధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శుక్రవారం ఆయన సమావేశమై మాట్లాడారు. లోక్ అదాలత్ ప్రక్రియలో సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టులు ఇచ్చిన తీర్పులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు కే.వీ.చంద్రశేఖరరావు, కె.దీప, బి.రజిని, వై.బిందుప్రియ, వి.మాధవి, ప్రాసిక్యూటింగ్ అధికారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా, జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా ఖమ్మంలో ఏడు బెంచ్‌లు ఏర్పాటుచేశారు. రోడ్డు ప్రమాద నష్టపరిహారం కేసులను మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.ఉమాదేవి, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులకు సంబంధించిన సివిల్ కేసులను అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం.కల్పన అధ్యక్షతన బెంచ్‌లో పరిష్కరిస్తారు. ఇక శనివారం ఉదయం 10 గంటలకు న్యాయ సేవా సదన్‌లో జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా జడ్జి జి.రాజగోపాల్ ప్రారంభించనున్నారు.

మళ్లీ బదిలీల సందడి

- టీచర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల
- జిల్లాలో వెయ్యి మందికి అవకాశం

ఖమ్మం సహకారనగర్: విద్యాశాఖలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సందడి మొదలుకానుంది. తొమ్మిది నెలల క్రితం ప్రక్రియ నిలిచిపోగా తిరిగి కొనసాగించేలా ప్రభుత్వం శుక్రవారం షెడ్యూల్ విడుదల చేసింది. గత ప్రభుత్వ హయాంలో ఆగిన దగ్గర నుంచే ఈ ప్రక్రియ కొనసాగించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. కాగా, జిల్లాలో వెయ్యి మందికి వరకు ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల్లో అవకాశం లభించనుంది. గతంలో బదిలీ అయినా పాత స్థానంలోనే విధులు నిర్వర్తిస్తున్న 250మంది ఉపాధ్యాయులు తొలుత కొత్త స్థానాల్లో విధుల్లో చేరాల్సి ఉంటుంది. ఇక షెడ్యూల్‌లో భాగంగా పదోన్నతులకు శనివారం సీనియారిటీ జాబితా వెల్లడిస్తారు. ఈమేరకు ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా సుమారు 330మందికి, పండిట్, పీఈటీలకు అప్‌గ్రేడేషన్‌లో సుమారు 350మందికి పదోన్నతి లభించే అవకాశం ఉన్నట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అలాగే, ఎస్‌జీటీలు సుమారు 2వేల మంది బదిలీ జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. కాగా, టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతి కల్పిస్తామని ప్రకటించిన ఉన్నతాధికారులు, ఉద్యోగ విరమణకు మూడేళ్ల సమయం ఉన్న వారికి మినహాయింపు ఇస్తామని తెలిపారు.

పారదర్శకంగా...

సీనియారిటీ ఆధారంగా బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సీనియారిటీ జాబితాను శనివారం ఆన్‌లైన్‌లో పొందుపర్చి అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించాక ప్రక్రియ కొనసాగిస్తారు. జిల్లా మల్టీ జోన్-1లో ఉన్న నేపథ్యాన శనివారం నుంచి 22వ తేదీలోగా బదిలీలు, పదోన్నతులు పూర్తిచేస్తారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- అమ్మ ఆదర్శ పాఠశాలల్లో తనిఖీ



నాగిలిగొండ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

చింతకాని: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచి బడులు తెరిచే నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. చింతకాని మండలం రాఘవాపురం, లచ్చగూడెం, నేరడ, నాగిలిగొండ గ్రామాల్లోని పాఠశాలల్లో పనులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలకు మంజూరైన నిధులు, చేపడుతున్న పనులు, పెండింగ్ అంశాలపై ఆరా తీశారు. పూర్తయిన మేరకు ఎప్పటికప్పుడు బిల్లుల చెల్లించాలని అధికారులకు సూచించారు. పాఠశాలల్లో విద్యుద్దీకరణ పనులు, టాయిలెట్ బ్లాక్‌ల నిర్మాణం, తాగునీటి సరఫరా వివరాలు తెలుసుకున్న కలెక్టర్ విద్యార్థులు వచ్చేలా స్పష్టమైన మార్పు కనిపించాలని తెలిపారు. అలాగే, పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగేలా బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులు, ఉపాధ్యాయులకు సూచించారు. నేరడలోని పాఠశాలలకు ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు. తనిఖీల్లో డీఈఓ సోమశేఖరశర్మ, ఎంపీడీఓ రామయ్య, తహసీల్దార్ రమేష్, ఎంఈఓ ఎం.శ్యాంసన్, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–1కు ఏర్పాట్లు పూర్తి

ఖమ్మం సహకారనగర్: ఈనెల 9వ తేదీన జరగనున్న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేసి పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన ఫ్లయింగ్ స్క్వాడ్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లతో సమీక్షించారు. జిల్లాలోని 52 కేంద్రాల్లో 18,403 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానుండగా, అభ్యర్థులు కేంద్రానికి ఉదయం 9గంటలకల్లా చేరుకునేలా చూసి 10 గంటలకు గేట్లు మూసివేయాలని తెలిపారు. కాగా, ప్రతీ అభ్యర్థి హాల్ టికెట్‌తో పాటు ఆధార్, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తెచ్చుకోవాలని, షూ, జ్యూయెలరీ వేసుకురావొద్దని సూచించారు. ఇక గ్రూప్–1 ప్రిలిమినరీ ప్రశ్నపత్రాలు, ఇతర సామగ్రి చేరుకోగా జిల్లా నోడల్ అధికారి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ సమక్షాన కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చారు. ఈకార్యక్రమాల్లో అడిషనల్ డీసీపీ ప్రసాదరావు, రీజినల్ కోఆర్డినేటర్లు జాన్‌బాబు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫుట్‌బాల్ టోర్నీ విజేత ఇల్లెందు, వీ.వీ.పాలెం



అండర్–10 విజేత వీవీ పాలెం జట్టుతో నిర్వాహకులు

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలో శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ టోర్నీని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేతు సెల్యూకాస్, కె.ఆదర్శ్‌కుమార్ ప్రారంభించారు. ఈ పోటీల్లో ఇల్లెందు, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు వీవీ పాలెం, ఖమ్మం నుంచి జట్లు పాల్గొన్నాయి. అండర్–14 బాలుర ఫైనల్స్‌లో ఇల్లెందు, వీవీ పాలెం జట్లు తలపడగా ఇల్లెందు జట్టు విజేతగా నిలిచింది. ఇక అండర్–10 విభాగంలో వీవీ పాలెం, ఖమ్మం జట్లు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. ఈ మేరకు విజేత జట్లకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

'తెలుగు మీడియం' ను కొనసాగించాలి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మీడియం కూడా కొనసాగించాలని టీఎస్ యుటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో 1నుంచి 8వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం, 9, 10వ తరగతులకు రెండు మీడియంలో బోధించేలా తల్లిదండ్రుల అభిప్రాయాలు తీసుకోవాలని గతంలో విద్యాశాఖ సూచించిందని తెలిపారు. అందుకోసం ద్విభాషా పుస్తకాలను సైతం అందించారని చెప్పారు. కానీ జిల్లాలో ఇంగ్లిష్ మీడియం మాత్రమే కొనసాగించాలని కలెక్టర్ చెప్పినట్లు డీఈఓ, ఎంఈఓలు హెచ్‌ఎంలకు సూచిస్తున్నారని తెలిపారు. ఇకనైనా ఈ విషయంలో పునరాలోచన చేయాలని వారు కోరారు.

పంటల కొనుగోళ్లు ప్రారంభం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం నుంచి పంట ఉత్పత్తుల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఎండల తీవ్రత నేపథ్యాన గతనెల 11 నుంచి ఈనెల 6వ తేదీ వరకు సెలవులు ప్రకటించిన విషయం విదితమే. ఈమేరకు శుక్రవారం మార్కెట్ పునఃప్రారంభం కాగా, రైతులు పలువురు ఇళ్లలో, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చి, తదితర పంట ఉత్పత్తులను తీసుకొచ్చారు. అయితే, తొలిరోజు మిర్చి, పత్తి, పెసర పంటలను అరకొరగానే తీసుకొచ్చినా ఇది మరింత పెరిగే అవకాశముంది.

కండక్టర్లు, డ్రైవర్లకు పదోన్నతి

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీలో పలువురు కండక్టర్లు, డ్రైవర్లకు పదోన్నతి లభించింది. ఖమ్మం రీజియన్‌లో విధులు నిర్వర్తిస్తున్న 12 మంది కండక్టర్లు, ఇద్దరు డ్రైవర్లు ఏడీసీ (కంట్రోలర్)లుగా పదోన్నతి పొందారు. ఈమేరకు శుక్రవారం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఇంటి తాళం పగలగొట్టి చోరీ

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి 13వ వార్డుకు చెందిన తాళ్లూరి సందీప్ ఇంట్లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. రెండు రోజులక్రితం ఆయన ఇంటికి తాళం వేసి బంధువుల వద్దకు వెళ్లాడు. ఈనేపథ్యాన ఇంటి తాళాలతో పాటు బీరువా తాళాలు పగలగొట్టిన నిందితులు వెండి, బంగారు ఆభరణాలతో పాటు ఎల్‌ఈడీ టీవీని ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సందీప్ చేరుకుని ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ వంశీకృష్ణ పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,000	6,700
మిర్చి	16,200	10,500
మిర్చి తాలు	7,000	5,500
ఏసీ మిర్చి	20,000	10,000
పత్తి	7,050	4,000

– ఖమ్మం వ్యవసాయం

జల పుష్పాల సందడి

- నేడు మృగశిర కార్తె
- విక్రయానికి చేపలు సిద్ధం
- జిల్లాకు ఏపీ నుంచి భారీగా దిగుమతి



పెద్ద చేపతో మహిళ, మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న చేపలు

ఖమ్మంవ్యవసాయం: మృగశిర కార్తె అనగానే తొలుత గుర్తుకొచ్చేది చేపలు. ఈ కార్తె ఆరంభం రోజున చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. మృగశిర కార్తెతో వేసవి కాలం దాదాపు ముగిసి వర్షాకాలం మొదలైందని భావిస్తారు. ఈ నేపథ్యాన కార్తె మొదటి రోజు చేపలు తింటే మంచిదని నమ్ముతారు. ఇదేరోజు ఉబ్బసం, ఆయాసంతో బాధపడుతున్న వారికి హైదరాబాద్‌లో బత్తిని సోదరులు చేపమందు ఇవ్వడం అందరికీ తెలిసిందే. ఇక ఈరోజు చేపలు తింటే వేసవిలో ఉష్ణోగ్రతతో శరీరంలో పెరిగే వేడి దూరమవుతుందని చెబుతారు. ఇలా కారణాలు ఏమైనా మృగశిర ఆరంభం రోజున చేపలు తినడానికి జనం ఆసక్తి చూపిస్తుండటంతో అమ్మకాలు కూడా జోరుగా సాగనున్నాయి. ఈ మేరకు జిల్లాలో దాదాపు 100 టన్నులకు పైగా చేపల అమ్మకం సాగనున్నట్లు అంచనా. ఒక్క ఖమ్మం నగరంలోనే సుమారు 40 నుంచి 50 టన్నుల చేపలు అమ్ముడవుతాయని విక్రయదారులు చెబుతున్నారు.



మృగశిరకు విక్రయానికి సిద్ధంగా ఉన్న చేపలు

సరిపడా లభ్యత లేక..

మృగశిర కార్తె రోజున ప్రజలు చేపలు తినడానికి ప్రాధాన్యత ఇస్తుండగా ఆ స్థాయిలో లభ్యత లేదు. దీంతో విక్రయదారులు, మత్స్యకారులు పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, గోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున చేపలను శుక్రవారం సాయంత్రానికి దిగుమతి చేసుకున్నారు. ఆయా జిల్లాలో ఉన్న చేపల చెరువుల నుంచి టన్నుల కొద్ది చేపలను తెప్పించి.. అమ్మకానికి సిద్ధం చేశారు.

రకాల ఆధారంగా డిమాండ్

మృగశిర కార్తె సందర్భంగా చేపలకు డిమాండ్ పెరిగింది. శనివారం మృగశిర అయినప్పటికీ లభ్యత, ధర ఎలా ఉంటాయోనన్న భావనతో పలువురు శుక్రవారమే కొనుగోలుకు రాగా విక్రయం ఊపందుకుంది. దీంతో ధరలూ పెరిగాయి. సహజంగా ఇక్కడ అధిక ధర ఉండే కొర్రమేను చేప కిలో రూ.350 నుంచి రూ.500కు చేరింది. ఇక పచ్చి రొయ్యలు కిలో రూ.450 చొప్పున విక్రయిస్తుండగా, బొచ్చలు, రవ్వలు, గ్యాస్‌కట్‌లు, బంగారు తీగలు వంటి రకాలను రూ.200 నుంచి రూ.220 వరకు అమ్ముతున్నారు.

మొదటి నుంచి అలవాటు



మృగశిర కార్తె ఆరంభం రోజున చేపలు తినడం అలవాటు. ఈ రోజు చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని చెప్పేవారు. అందుకే ఏటా ఈ కార్తె రోజున చేపలు తప్పక కొనుగోలు చేస్తాం. చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని, ఉబ్బసం, ఆయాసం వంటి వ్యాధులు దూరమవుతాయని నమ్మకం.

–ప్రభాకర్, బురహాన్‌పురం, ఖమ్మం

చేపల విక్రయాలు పెరిగాయి..



మృగశిర కార్తె సందర్భంగా చేపల విక్రయాలు పెరిగాయి. ఇక్కడ చేపలు సరిపడా లేకపోవడంతో ఏపీ నుంచి తెప్పించాం. చాలామంది ముందు రోజే ఆర్డర్ చేశారు. ఈసారి కొర్రమేను రకం చేపలకు డిమాండ్ ఉంది. ఇతర రకాలు సైతం బాగానే అమ్ముడవుతాయనే నమ్మకంతో దిగుమతి చేసుకున్నాం.

–రేణుక, చేపల విక్రయదారు, త్రీటౌన్, ఖమ్మం

ఎండలు తగ్గినా తీయలేదు..

- డీఆర్‌డీఏలో మూలుగుతున్న ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు
- ఉపాధి కూలీలకు పంపిణీ చేయని వైనం

ఖమ్మంమయూరిసెంటర్: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదనే సామెత జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు వర్తిస్తోంది. ఈ ఏడాది ఎండలు భారీగా నమోదు కావడంతో ఉపాధి కూలీలు వడదెబ్బ బారిన పడకుండా పలు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే కలెక్టర్ ఆదేశాలతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కూలీల కోసం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను సమకూర్చారు. అయితే, లక్ష మేర ప్యాకెట్లు డీఆర్‌డీఏకు చేరినా అక్కడి నుంచి పని ప్రదేశాలకు మాత్రం అరకొరగానే పంపించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఎండాకాలం చివరి దశకు చేరగా అధికారుల నిర్లక్ష్యంతో జిల్లా కార్యాలయంలోనే ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఓ మూలన పడి ఉన్నాయి. ఏప్రిల్, మే నెలల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా, ఇతర మార్గాలు లేక ఎండను సైతం లెక్క చేయక కూలీలు పనులకు వచ్చారు. ఇందులో మంది డీహైడ్రేషన్‌కు గురై ఓఆర్‌ఎస్ అందుబాటులో లేక ఇబ్బంది పడ్డారు. కాగా, ఉపాధి కూలీల కోసం వైద్య, ఆరోగ్య శాఖ సమకూర్చిన ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను వినియోగించకుండా పక్కదారి పట్టిస్తున్నారనే విమర్శలు డీఆర్‌డీఏలో వినిపిస్తున్నాయి. అధికారులు భారీ మొత్తంలో ప్యాకెట్లను ఓ గదిలో మూలన పడేయడమే కాక పర్యవేక్షించాల్సిన అధికారి పట్టించుకోకుండా ఇంటి దొంగలున్నారని తెలిసినా వారికే తాళాలు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఉపాధి కూలీల విషయాన్ని పక్కన పెట్టి కొందరు ఉద్యోగులు, సిబ్బంది ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను తమ ఇళ్లకు తీసుకుని వెళ్తున్నారని, పలు డబ్బాల సీల్ తీసి ఉండడం.. సామర్థ్యానికి మించి తక్కువ ప్యాకెట్లు ఉండడమే ఇందుకు నిదర్శనమనే చర్చ జరుగుతోంది.



చించి ఉన్న ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల డబ్బా



డీఆర్‌డీఏ కార్యాలయంలోని ఓ గదిలో పెట్టిన ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల డబ్బాలు

ఓవరాల్ చాంపియన్‌గా భద్రాద్రి జిల్లా

- అండర్–18 బాలికల్లో భద్రాద్రి, ఉమెన్స్ కేటగిరీలో ఖమ్మం క్రీడాకారుల సత్తా
- ముగిసిన సీనియర్స్, సబ్ జూనియర్స్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్/కొత్తగూడెం టౌన్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజులపాటు జరిగిన 10వ యూత్, సీనియర్ మెన్ అండ్ ఉమెన్, సబ్ జూనియర్స్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ పోటీల్లో 48 పాయింట్లతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెట్లు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. అలాగే, అండర్–18 బాలికల విభాగంలో 15పాయింట్లతో భద్రాద్రి జిల్లా, సీనియర్ ఉమెన్స్ కేటగిరీలో ఖమ్మం జిల్లా మొదటి స్థానంలో నిలిచాయని నిర్వాహకులు ప్రకటించారు. పోటీల ముగింపు వేడుకల్లో ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో హనుకొండ డీవైఎస్‌ఓ అశోక్, అథ్లెటిక్స్ వరల్డ్ టెక్నికల్ కమిటీ డైరెక్టర్ స్టాన్లీజోన్స్, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు. కాగా, పతకాలు సాధించిన భద్రాద్రి జిల్లా క్రీడాకారులు అభినవ్‌నాయక్, సిద్ధి వినయ్, బి.దాకేశ్ స్వమిత్, పి.మనోజ్‌కుమార్, సీహెచ్.వినయ్, వాసం రాజు, టి.శ్రీతేజ, పృథ్వీక, గణేశ్, మనోజ్‌కుమార్, ఎ.వందన,ఎం.సంగీత, పీ.ఎస్ అభిలాష్, ఎం.అఖిల్, ఓ.శశాంక్ తదితరులను డీవైఎస్‌ఓ కె.సంజీవరావు, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జీవీకే మనోహర్‌రావుతో పాటు మొగిలి, రాసపల్లి రాజేందర్, సారంగపాణి, పి.నాగేందర్, కె.శివ, ఎం.నరేశ్, డి.మల్లికార్జున్‌రావు, జన్ను గిరిప్రసాద్, ఎం.కృష్ణ తదితరులు అభినందించారు.



భద్రాద్రి జిల్లా క్రీడాకారులతో ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమేశ్, నిర్వాహకులు

అప్రమత్తమైన పోలీస్ శాఖ

ఖమ్మంక్రైం: రాష్ట్ర పోలీసు శాఖకు చెందిన యాప్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేయటంతో జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ఎంతో రహస్యంగా ఉండే యాప్‌ను హ్యాక్ చేయడం కలకలం రేకెత్తించింది. రాష్ట్రంలో ఉన్న అందరు పోలీస్ సిబ్బంది డేటాను హ్యాక్ చేయడంతో జిల్లా ఉద్యోగులకు ఉన్నతాధికారులు సూచనలు చేశారు. ముఖ్యంగా ఐటీ కోర్, సైబర్ పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

బస్సు - లారీ ఢీ, పలువురికి గాయాలు

వైరా: వైరా పోలీస్‌స్టేషన్ సమీపాన శుక్రవారం ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న ఘటనలో పలువురు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వైరా ఆర్టీసీ బస్టాండ్ నుంచి సత్తుపల్లి డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు బయటకు వస్తుండగా ఖమ్మం వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు స్వల్పంగా గాలయ్యాయి.

మహిళ దారుణ హత్య

- కత్తితో పొడిచి ఘాతుకానికి పాల్పడిన నిందితుడు
- ఆపై అదే కత్తితో పొడుచుకుని ఆత్మహత్యాయత్నం
- జిల్లాలోని భైరవునిపల్లిలో ఘటన



సైదమ్మ (ఫైల్)

నేలకొండపల్లి: నేలకొండపల్లి మండలంలోని బైరవునిపల్లిలో శుక్రవారం ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. తనతో వివాహేతర సంబంధం పెట్టుకోవాలని కొన్నాళ్లుగా వేధిస్తున్న ఓ వ్యక్తి ఈ ఘటనకు పాల్పడగా ఆయన కూడా కత్తితో పొడుచుకుని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికుల కథనం ప్రకారం ఘటనకు సంబంధించి వివరాలు... బైరవునిపల్లి గ్రామానికి చెందిన కోళ్ల సైదమ్మ(47)తో ఆమె భర్త దూరంగా ఉంటుండగా, సూర్యాపేట జిల్లా కోదాడలోని ఓప్రైవేట్ పాఠశాల హాస్టల్‌లో వార్డెన్‌గా పనిచేస్తోంది. ప్రస్తుతం సెలవులు కావడంతో స్వగ్రామమైన బైరవునిపల్లి వచ్చింది. అదే గ్రామానికి చెందిన సొంటి శ్రీను తనతో వివాహేతర సంబంధం పెట్టుకోవాలని ఆమెను కొన్నాళ్లుగా వేధిస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఇంటికి వెళ్లి కొట్టినట్లు తెలిసింది. ఈనేపథ్యాన శుక్రవారం కూడా సైదమ్మ ఒంటరిగా ఉన్నట్లు తెలుసుకున్న శ్రీను వెళ్లి గొడవకు దిగాడు. ఆమె తనను నిరాకరించిందన్న కోపంతో ముందుగానే సిద్ధం చేసుకున్న కత్తితో మూడు చోట్ల బలంగా పొడిచాడు. ఆపై చేతులను కత్తితో ఇష్టానుసారంగా కోశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సైదమ్మ రక్తపు మడుగులో పడి పోయింది. దీంతో స్థానికులు ఆమెను నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇదిలా ఉండగా శ్రీను సైతం అదే కత్తితో పొడుచుకోగా పేగులు బయటకు రావడంతో అపస్మారక స్థితిలో పడిపోయాడు. ఆయనను ఖమ్మం తరలించగా పరిస్థితి విషమంగానే ఉన్నట్లు సమాచారం. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉండగా, సెలవుల్లో ఇంటికి రాకుండా కోదాడలో ఉన్నా బతికేదని వారు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.



ఆస్పత్రి వద్ద పర్యవేక్షిస్తున్న సీఐ రాజిరెడ్డి

భారీ బందోబస్తు

హత్య జరగడంతో బైరవునిపల్లిలో ఉద్రిక్తత నెలకొంది. సైదమ్మ కుటుంబ సభ్యులు, బంధువులు హత్య చేసిన శ్రీను కోసం గ్రామంలో గాలించారు. కానీ ఆయన సైతం ఆత్మహత్యకు యత్నించినట్లు తెలుసుకున్న వారు ఆగ్రహంతో ఉండగా.. ఎలాంటి ఘటనలు జరగకుండా ఖమ్మం రూరల్ సీఐ రాజిరెడ్డి ఆధ్వర్యాన నేలకొండపల్లి, ముదిగొండ ఎస్సైలు తోట నాగరాజు, నరేష్, సిబ్బందితో పహారా ఏర్పాటు చేశారు. ఘటనపై మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అన్నపై తమ్ముడి హత్యాయత్నం

తల్లాడ: మండలంలోని వెంకటాపురంలో గురువారం అర్ధరాత్రి అన్నపై తమ్ముడు హత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వెంకటాపురానికి చెందిన నేలవెళ్లి వెంకటేశ్వరరావు నిద్రిస్తున్న సమయాన ఉద్యోగ రీత్యా ఇల్లెందులో ఉంటున్న ఆయన తమ్ముడు నర్సింహారావు రెండు కార్లలో మరికొందరితో కలిసి వచ్చి కర్రలు, రాడ్లతో దాడి చేశాడు. ఆయన భార్య సత్యవతి అడ్డు పడగా ఆమెను కూడా కొట్టి పరారయ్యారు. దీంతో ఇద్దరికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు. కాగా, అన్నాతమ్ముళ్ల నడుమ కొన్నేళ్లుగా కొనసాగుతున్న భూవివాదమే ఈ ఘటనకు కారణమని తెలిసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ కొండల్‌రావు తెలిపారు.

అనారోగ్యంతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

ఖమ్మంక్రైం: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న హెడ్ కానిస్టేబల్ శుక్రవారం మృతి చెందాడు. ఖమ్మం ముస్తఫానగర్‌కు చెందిన రాయంచల కోటేశ్వరరావు(52) ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో చికిత్స చేయిస్తుండగానే మృతి చెందాడు. కోటేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉండగా, భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

ఏన్కూరు: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఇది. మండలంలోని అక్కినాపురం తండాలో గురువారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. అయితే, ప్రమాదానికి కారణమైన వాహనం వివరాలతో పాటు మృతుడి ఆచూకీ తెలియరాలేదు. మృతుడు ఎర్రగళ్ల చొక్కా, జీన్‌ప్యాంట్, టోపీ ధరించి ఉన్నాడని ఎస్‌ఐ బాదావత్ రవి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంకు చెందిన ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన గోవింద్ నరేష్(35) గురువారం రాత్రి పురుగు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా కుటుంబీకులు ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కొండల్‌రావు తెలిపారు.

విద్యుదాఘాతంతో నాలుగు పశువుల మృతి

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లెపల్లిలో గాలిదుమారానికి పడిపోయిన విద్యుత్‌తీగను తాకడంతో షాక్‌కు గురైన మూడు ఆవులు, ఒక గేదె మృతి చెందాయి. జల్లెపల్లికి చెందిన రేఖ యాలాద్రి, తురక వెంకన్న, బానోతు హరిసింగ్‌లకు చెందిన ఆవులు, మేకల యాలాద్రికి చెందిన గేదె మేత కోసం గురువారం ఉదయం అడవి వెళ్లాయి. సాయంత్రం గాలిదుమారంతో విద్యుత్ తీగలు తెగిపగా ఆ తీగను తాకిన నాలుగు పశువులు మృతిచెందాయి. ఈమేరకు శుక్రవారం అధికారులు పరిశీలించగా పరిహారం ఇప్పించాలని రైతులు కోరారు.

రూ.10లక్షల విలువైన గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉద్యోగులు శుక్రవారం చేపట్టిన తనిఖీల్లో సుమారు రూ.10లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ నుంచి ముంబై వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో ఖమ్మం స్టేషన్‌లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెండు సంచుల్లో ఉన్న 23కేజీల గంజాయి లభించగా, తరలిస్తున్న నిందితుల జాడ తెలియరాలేదు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుంకరి రమేష్, ఉద్యోగులు హరీష్, వెంకట్, హన్మంతరావు, సుధీర్, విజయ్, బేబీ పాల్గొనగా వీరిని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ గణేష్, ఏఈఎస్ తిరుపతి అభినందించారు. కాగా, ఇదే రైలులో గురువారం 10కేజీల గంజాయి పట్టుబడిందని తెలిపారు. ఇక ఖమ్మం శ్రీనివాస్‌నగర్‌లో చేకూరి శ్రీను మహబూబాబాద్ నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్న 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ స్టేషన్–2 సీఐ చంద్రమోహన్ తెలిపారు.



రైలులో స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎక్సైజ్ ఉద్యోగులు

ఎమ్మెల్సీగా మల్లన్న...

- మొదటి, రెండో ప్రాధాన్యతలోనూ మెజారిటీ
- మూడు రోజులు కొనసాగిన ఓట్ల లెక్కింపు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న విజయం సాధించారు. ఓట్ల లెక్కింపు మూడు రోజులు నిర్విరామంగా కొనసాగి శుక్రవారం అర్ధరాత్రి ముగిసింది. ఈ నెల 5వ తేదీన ఉదయం 8 గంటలకు లెక్కింపు మొదలుపెట్టిన ఉద్యోగులు పగలు, రాత్రీ తేడా లేకుండా చేపట్టారు. తొలిరోజైన బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. గురువారం రాత్రి వరకు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తి చేశారు. అయితే మొదటి ప్రాధాన్యతలో అభ్యర్థులెవరికీ గెలుపునకు నిర్ణయించిన లక్ష్యం మేరకు 1,55,095 ఓట్లు రాకపోవడంతో ఎలిమినేషన్ ద్వారా రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపును గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు చేపట్టారు.



ఓట్లు లెక్కిస్తున్న అధికారులు

రెండో ప్రాధాన్యతలోనే తేలిన లెక్క

ఓట్ల లెక్కింపు ఉత్కంఠగా సాగింది. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ప్రతీ రౌండ్‌లో కాంగ్రెస్ బలపర్చిన మల్లన్న మెజార్టీ సాధించినా గెలుపునకు సరిపడా ఓట్లు రాలేదు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో మొదటి రౌండ్‌లో తీన్మార్ మల్లన్నకు 36,210, బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి 28,540 ఓట్లు రాగా మల్లన్న 7,670 ఓట్ల మెజార్టీ సాధించారు. రెండో రౌండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు 34,574, బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి 27,574 ఓట్లు రావడంతో మల్లన్న 7వేల ఓట్ల ఆధిక్యంలో నిలిచారు. ఇక 3, 4 రౌండ్లలో కలిపి మల్లన్న 52,029 ఓట్లు సాధించగా బీఆర్‌ఎస్ అభ్యర్థికి 48,134 ఓట్లే వచ్చాయి. ఈ రౌండ్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కంటే 3895 ఓట్ల అధిక్యత సాధించారు. దీంతో మొదటి ప్రాధాన్యత ఓట్లలో మొత్తం 18,565 ఓట్ల ఆధిక్యంలో కాంగ్రెస్ అభ్యర్థి నిలిచారు.

రెండో ప్రాధాన్యత ఓట్లలోనూ అధిక్యతే..

రెండో ప్రాధాన్యత ఓట్లలో కూడా మల్లన్న ఆధిక్యం సాధించారు. 52 మంది అభ్యర్థులు పోటీలో నిలవగా ఆయనకు 1,22,813 ఓట్లు వచ్చినా గెలుపునకు సరిపడా 1,55,096 ఓట్లు రాలేదు. దీంతో ఇంకా 32,282 ఓట్లు రావాల్సి ఉంది. మరోపక్క బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు 1,04,248 ఓట్లు రాగా, ఆయన గెలుపు లక్ష్యం చేరుకోవాలంటే 50,840 ఓట్ల అవసరముంది. ఈనేపథ్యాన తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులను ఎలిమినేట్ చేస్తూ రెండో ప్రాధాన్యత, సబ్ పార్సిల్ ఓట్లను లెక్కిస్తూ వచ్చారు. ఇలా తక్కువ ఓట్లు వచ్చిన 48 మంది అభ్యర్థులను ఎలిమినేట్ చేసి వారికి వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్లతో పాటు సబ్ పార్సిల్(ఇతర ప్రాధాన్యతలు) ఓట్లు లెక్కించారు. దీంతో మిగిలిన నలుగురు అభ్యర్థుల్లో కాంగ్రెస్ అభ్యర్థి మల్ల న్న 1,24,899 ఓట్లకు చేరుకోగా, బీఆర్‌ఎస్ అభ్యర్థికి 1,05,524 ఓట్లు వచ్చాయి. కాగా, బీజేపీ అభ్యర్థి 43,096 ఓట్లకు చేరుకున్నారు. అయినా గెలుపు లక్ష్యానికి ఎవరూ చేరుకోకపోవడంతో నాలుగో స్థానంలో ఉన్న స్వతంత్ర అభ్యర్థి అశోక్‌ను ఎలిమినేట్ చేసి ఆయనకు వచ్చిన రెండో ప్రాధాన్యత, సబ్ పార్సిల్ ఓట్లు లెక్కించారు. అయినా టార్గెట్ రాకపోవడంతో బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని సైతం ఎలిమినేట్ చేసి ఆయన ఓట్లను లెక్కించారు. అప్పటికి కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు బీఆర్‌ఎస్ అభ్యర్థి కంటే అధిక మెజారిటీ ఉన్నా గెలుపు టార్గెట్‌కు సరిపడా ఓట్లు రాలేదు. దీంతో మల్లన్న గెలిచినట్లే భావించాల్సి ఉన్నా తక్కువ ఓట్లు వచ్చిన బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని ఎలిమినేట్ చేసి ఆయనకు వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తున్నారు. సాంకేతికంగా మల్లన్న విజయాన్ని చేరుకునేవరకు రాకేష్‌రెడ్డి ఓట్లను లెక్కించాల్సి ఉన్నందున ఆ ప్రక్రియ చేపట్టారు. ఇదంతా పూర్తయ్యాక అధికారులు మల్లన్నకు గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తారు.

కొత్త సీఎస్‌గా నీరబ్‌కుమార్ ప్రసాద్ బాధ్యతలు

ప్రస్తుత సీఎస్ జవహర్‌రెడ్డిని బదిలీ చేసిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ప్రస్తుత సీఎస్ డా.కేఎస్ జవహర్‌రెడ్డిని బదిలీ చేస్తూ నీరబ్‌కుమార్‌ప్రసాద్‌ను సీఎస్‌గా నియమిస్తూ రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ఆదేశాలిచ్చింది. రాష్ట్ర సచివాలయంలో సీఎస్ చాంబర్ టీటీడీ వేద పండితులు, విజయవాడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానాల వేద పండితుల దివ్య ఆశీస్సుల మధ్య నీరబ్ కుమార్ ప్రసాద్ సీఎస్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ సహచర కార్యదర్శులు, శాఖాధిపతులు, ఇతర అధికారులు, సిబ్బంది సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా పనిచేసి వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో సమర్థంగా అమలు చేయడం ద్వారా రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందంజలో నిలిపేందుకు సాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జీఏడీ కార్యదర్శి సురేశ్ కుమార్, స్పెషల్ సీఎస్‌లు గోపాల కృష్ణ ద్వివేది, రజత్ భార్గవ, విజయానంద్, పీసీసీఎఫ్ వై.మధుసూదన్ రెడ్డి, ముఖ్య కార్యదర్శులు కె.సునీత, ప్రవీణ్ ప్రకాశ్, ప్రద్యుమ్న, ఐటీ కార్యదర్శి కె.శశిధర్, సర్వీసెస్ శాఖ కార్యదర్శి పి.భాస్కర్ తదితరులున్నారు.

ఓటమిపై విశ్లేషించుకుంటాం

ఎంపీ ఆర్.కృష్ణయ్య



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమిపై లోతైన విశ్లేషణ చేసుకుంటామని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..జగన్ పాలనలో ఐదేళ్లపాటు దేశంలో ఎక్కడా లేని విధంగా అద్భుతమైన సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. లోపం ఎక్కడ జరిగిందో సమీక్షించుకుంటామని, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులేమిటో తెలుసుకుంటామని తెలిపారు. ప్రజలంతా వైఎస్సార్‌సీపీకే ఓటు వేస్తున్నట్లు చెప్పారని, ఈవీఎంలలో ఏమైనా లోపాలున్నాయేమోనని అనుమానం వ్యక్తం చేశారు. జగన్‌ను ఏపీ ప్రజలు వద్దనుకోలేదని, ఆయన అహంకారంతో ఓడిపోయారనేది అవాస్తవమని చెప్పారు.

రాష్ట్రంలో కుప్పకూలిన రాజ్యాంగ వ్యవస్థలు

చంద్రబాబు రాజకీయ కక్షసాధింపులతో ప్రజాస్వామ్యానికే పెనుముప్పు

- టీడీపీ యథేచ్ఛ దాడులతో ఆటవిక పరిస్థితులు
- అధికార యంత్రాంగం మొత్తం నిర్వీర్యం అయిపోయింది
- వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉన్మాదంతో దాడులు
- పోటీ చేసిన అభ్యర్థులకు రక్షణే లేకుండా పోయింది
- గవర్నర్ జోక్యం చేసుకోవాలని మరోసారి విజ్ఞప్తి చేసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్
- బాధితులకు వైఎస్సార్‌సీపీ తోడుగా నిలుస్తుందని భరోసా



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థలు కుప్పకూలిపోయాయని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు రాజకీయ కక్షసాధింపులతో ప్రజాస్వామ్యానికే పెనుముప్పు వచ్చిందని మండిపడ్డారు. టీడీపీ యథేచ్ఛ దాడులతో ఆటవిక పరిస్థితులు తలెత్తాయని, యంత్రాంగం మొత్తం నిర్వీర్యం అయిపోయిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉన్మాదంతో దాడులు చేస్తున్నారని, పార్టీ నుంచి పోటీ చేసిన అభ్యర్థులకు రక్షణే లేకుండా పోయిందని చెప్పారు. ఉన్నత చదవులకు కేంద్రాలైన యూనివర్సిటీల్లో ఆచార్యులపై దౌర్జన్యాలకు దిగి వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. గత ఐదేళ్లలో పాలనా సంస్కరణలు, పేదలను ఆదుకునే కార్యక్రమాలతో దేశంలో రాష్ట్రానికి వచ్చిన పేరు ప్రఖ్యాతులన్నింటినీ దెబ్బ తీసి, కేవలం మూడు రోజుల్లోనే హింసాయుత రాష్ట్రంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి, పౌర స్వేచ్ఛకు తీవ్ర భంగం వాటిల్లుతోందని, గవర్నర్ జోక్యం చేసుకోవాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. హింసాయుత ఘటనల్లో బాధితులైన పార్టీ కార్యకర్తలకు, తన అన్నదమ్ములకు, అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్‌సీపీ తోడుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్(ట్విట్టర్)లో పోస్టు చేశారు.

కేబినెట్ పదవి.. 2 సహాయ శాఖలు!

- టీడీపీకి అంతకంటే ఇచ్చేందుకు సానుకూలంగా లేని బీజేపీ
- మరోసారి పౌర విమానయానమే తీసుకోవాలని సూచన
- కీలక శాఖలు, స్పీకర్ పదవికి నో.. డిప్యూటీ స్పీకరైతే సరే
- జేపీ నడ్డాతో చంద్రబాబు మంతనాలు

సాక్షి, న్యూఢిల్లీ: కొత్తగా కొలువుదీరనున్న ఎన్‌డీఏ ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జేడీయూలు అడుగుతున్నన్ని కేబినెట్ బెర్త్‌లు, కీలక శాఖలు ఇచ్చేందుకు బీజేపీ సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో 16 లోక్‌సభ స్థానాలు గెలుచుకున్న టీడీపీ కోరుతున్నట్లుగా ఐదు కేబినెట్ పదవులతో పాటు స్పీకర్ పదవి ఇవ్వడం సాధ్యం కాదనే విషయాన్ని బీజేపీ పెద్దలు చంద్రబాబుకు తేల్చి చెప్పినట్లు సమాచారం. టీడీపీకి ఒక కేబినెట్ మంత్రిత్వ శాఖతో పాటు రెండు సహాయక మంత్రి పదవులను ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు ఢిల్లీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. శాఖల కేటాయింపుపై చంద్రబాబు శుక్రవారం రెండో దఫా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు ఇతర పెద్దలతో చర్చించినా సానుకూల ఫలితం దక్కలేదని తెలుస్తోంది.

కీలక శాఖలు ఇవ్వలేం..!

కేంద్రంలో ముచ్చటగా మూడోసారి కొలువుదీరనున్న మోదీ ప్రభుత్వంలో కీలకమైన హోం, ఆర్థిక, రక్షణ, రైల్వే, న్యాయ, ఐటీ, రోడ్లు, రహదారుల శాఖలను భాగస్వామ్య పక్షాలకు ఇవ్వకూడదని ఇప్పటికే బీజేపీ పెద్దలు నిరాకరించారు. దీంతో కేంద్ర జలశక్తి శాఖతో పాటు పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, ఐటీ కమ్యూనికేషన్లు, నౌకాయాన శాఖలను టీడీపీ కోరినట్లు తెలిసింది. దీనికి అదనంగా స్పీకర్ పదవి కూడా తమకే ఇవ్వాలని అడిగినట్లు జాతీయ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే బీజేపీ పెద్దలు ఇందుకు సుముఖంగా లేరని తెలుస్తోంది. 2014లో మాదిరిగానే పౌర విమానయాన శాఖతో పాటు సహాయ శాఖల్లో కీలక శాఖలు ఇచ్చేందుకు ఓకే చెప్పినట్లు సమాచారం. ఆ కీలక సహాయ శాఖలు ఆర్థిక లేదా జల శక్తి శాఖ కావచ్చనే ఊహాగానాలు సాగుతున్నాయి. స్పీకర్ పదవి కాకుండా డిప్యూటీ స్పీకర్ పదవిని ఇచ్చేందుకు బీజేపీ పెద్దలు సానుకూలంగా ఉన్నట్లు చెబుతున్నారు. 2019లో ఎన్‌డీఏ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చినప్పుడు డిప్యూటీ స్పీకర్ పదవిని అసలు కేటాయించలేదు. కేవలం స్పీకర్‌తోనే లోక్‌సభ వ్యవహారాలను నిర్వహించగా ప్రొటెం స్పీకర్‌లతో సభను నడిపించారు. 2014లో మాత్రం అన్నాడీఎంకేకు చెందిన తంబిదొరై, జార్ఖండ్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత కరియా ముండా డిప్యూటీ స్పీకర్లుగా వ్యవహరించారు.

మోదీతోపాటే ప్రమాణం..!

మంత్రి పదవులు, శాఖలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో చంద్రబాబు విడిగా చర్చించారు. ప్రాధాన్యతలను ఆయన దృష్టికి తెచ్చారు. నరేంద్ర మోదీతో పాటు ప్రమాణ స్వీకారం చేసే మంత్రుల్లో తమ పార్టీ వారు కచ్చితంగా ఉండేలా చూడాలని కోరినట్లు తెలిసింది.

ప్రజాస్వామ్యమా? ఆటవిక రాజ్యమా?

రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న టీడీపీ దాడులు

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, వారి ఆస్తులే లక్ష్యంగా విధ్వంసం



టీడీపీ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడిన పల్నాడు జిల్లా బ్రాహ్మణపల్లి సొసైటీ అధ్యక్షుడు పిచ్చిరెడ్డి

- పోలీసుల సమక్షంలోనే బెదిరింపులు, దాడులు, ఆస్తుల ధ్వంసం
- నిస్తేజంగా పోలీసు యంత్రాంగం; పరోక్షంగా రెచ్చగొడుతున్న చంద్రబాబు
- వైసీపీ కవ్వింపులపై టీడీపీ శ్రేణులు సంయమనం పాటించాలంటూ ట్వీట్
- తాను ప్రమాణ స్వీకారం చేసేదాకా ఇవి కొనసాగించాలని పరోక్ష సంకేతాలు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పూర్వం యుద్ధం ముగిశాక విజయం సాధించిన రాజులు ఓడిపోయిన రాజు రాజ్యంపై పడి విధ్వంసం సృష్టించేవారు. జనావాసాలపై దాడులు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేవారు. అందినకాడికి దోచుకునేవారు. ప్రజలంతా ఒకచోటుకు చేరి.. మోకరిల్లి శరణుకోరాక కానీ శాంతించే వారు కాదు. ఇప్పుడు రాష్ట్రంలో పరిస్థితి చూస్తుంటే అలాంటి దుస్థితే కనిపిస్తోంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుక్షణం నుంచి టీడీపీ శ్రేణులు యథేచ్ఛగా విధ్వంసకాండ కొనసాగిస్తున్నాయి. ఎక్కడికక్కడ దాడులకు తెగబడి భయోత్పాతం సృష్టిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీ అయినా విజయం సాధించాక తొలుత దృష్టి సారించాల్సింది శాంతి భద్రతల పరిరక్షణపైనే. అందుకు విరుద్ధంగా రాష్ట్రంలో టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యం కొనసాగిస్తుండగా... తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మాత్రం వారిని నిలువరించే ప్రయత్నం చేయకుండా... తిరిగి వైసీపీ కవ్వింపుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వైసీపీ కవ్వించినా సంయమనం పాటించాలంటూ ట్వీట్ చేయటం విధ్వంసాలకు మరింత ఊతమిచ్చేదిగా కనిపిస్తోంది. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది... వచ్చామన్న కిక్కుతో ఊరూరా కవ్వింపులకు, దాడులకు తెగబడుతున్నది తెలుగుదేశమే. మూడు రోజులుగా వరుస దాడులు చేస్తున్నా పోలీసులకు పైనుంచి ఆదేశాలుండటంతో చేష్టలుడిగి చూస్తున్నారు తప్ప నిలువరించే ప్రయత్నం చేయటం లేదు. తాను ప్రమాణ స్వీకారం చేసే వరకు ఏమైనా చేయండని, రెచ్చిపోండని చంద్రబాబు పరోక్షంగా సంకేతాలిచ్చారని, అందుకే పోలీసులు పట్టనట్లు ఊరుకుంటున్నారని విశ్వసనీయంగా తెలిసింది. ఎందుకంటే తాను ప్రమాణ స్వీకారం చేయకముందయితే తన హయాంలో జరగలేదని చెప్పొచ్చనేది బాబు యోచనగా చెబుతున్నారు.

గన్నవరం వద్ద చంద్రబాబు ప్రమాణస్వీకారం

- 12 ఉదయం 11.37 గంటలకు ముహూర్తం
- ప్రధాని మోదీ, పలువురు సీఎంలు వచ్చే అవకాశం

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఈ నెల 12న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకు ఆ రోజు ఉదయం 11.37 గంటలకు ముహూర్తం ఖరారు చేశారు. కృష్ణా జిల్లా గన్నవరం విమానాశ్రయం సమీపంలోని కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద ప్రమాణస్వీకార సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీతోపాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్డీయేలోని కీలక నేతలు హాజరవుతారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. అందుకే విమానాశ్రయానికి దగ్గరగా ఉన్న ప్రాంతాన్ని ఎంపిక చేశారు.

వర్మపై జనసేన కార్యకర్తల దాడి



జనసేన కార్యకర్తల దాడితో పగిలిన వర్మ కారు అద్దాలు

పిఠాపురం: పిఠాపురం టీడీపీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మపై జనసేన కార్యకర్తలు దాడికి దిగారు. ఈ ఘటనలో వర్మతో సహా పలువురికి గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో స్థానిక సర్పంచ్‌తో మంతనాలు జరిపేందుకు వర్మ వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ఆ గ్రామ జనసేన నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడకు వచ్చి వర్మను అడ్డుకున్నారు. 'మాకు తెలియకుండా మా గ్రామంలో ఇతర పార్టీల వాళ్లను ఎందుకు కలుస్తున్నారు' అంటూ వర్మను నిలదీశారు. మీకు చెప్పాల్సిన పని లేదంటూ వర్మ వారికి బదులివ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన జనసేన నేతలు, కార్యకర్తలు ఒక్కసారిగా ఆయనపై దాడికి దిగారు. రాళ్లు, కొబ్బరి కాయలతో వర్మ కారుపై దాడి చేయడంతో ఆయన కారు అద్దాలు పగిలిపోయాయి. వారి నుంచి తప్పించుకుని ఆయన కారులో వేగంగా వెళ్లిపోయారు. ఎన్నికల్లో పని చేసిన వారికి కృతజ్ఞతలు తెలపడానికి వెళితే జనసేన శ్రేణులు తనపై దాడి చేశాయని టీడీపీ నేత ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. అల్లరి మూకలను జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పెంచి పోషిస్తున్నారని మండిపడ్డారు. జనసేన నేతలు తనను చంపడానికి ప్రయత్నించారని ధ్వజమెత్తారు. 9 నెలలుగా ఉదయ్ తనను వేధిస్తున్నాడని.. జనసేనకు పనిచేయడం తన ఖర్మ అని వ్యాఖ్యానించారు. తనపై హత్యాయత్నం వెనుక ఉదయ్ హస్తం ఉందని ఆరోపించారు.

జిల్లా వార్తలు

'బీజేపీ దూకుడుకు ప్రజలు అడ్డుకట్ట వేశారు..'




సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: దేశాన్ని మతోన్మాదం, నియంతృత్వంతో పాలించి, వనరులను బహుళ జాతి సంస్థలకు అప్పగిస్తున్న బీజేపీ దూకుడుకు ఈ ఎన్నికల్లో ప్రజలు అడ్డుకట్ట వేశారని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాయకులు వి.కోటేశ్వరరావు అన్నారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం ఖమ్మంలో నిర్వహించగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తొలకరి మొదలైనా రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు పంటల ప్రణాళిక ప్రకటించలేదన్నారు. ఇకనైనా ప్రణాళిక సిద్ధం చేసి రైతులకు కావాల్సిన విత్తనాలు సమకూర్చాలని, నకిలీల బెడదను అరికట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, నాయకులు డేవిడ్ కుమార్, రాజేంద్ర ప్రసాద్, వెంకట్రాంరెడ్డి, భూమయ్య, నందగిరి వెంకటేశ్వర్లు, పాపయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి ఖమ్మంలో సుదీర్ఘ గానలహరి

- 32 మంది గాయకులతో 32 గంటల కార్యక్రమం



వివరాలు వెల్లడిస్తున్న నగేశ్

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి 32 గంటల పాటు 32 మంది గాయకులతో సుదీర్ఘ గానలహరి నిర్వహిస్తున్నట్లు స్వర మధురిమ కల్చరల్ ఈవెంట్స్ అధ్యక్షుడు ఇసనపల్లి నగేశ్ తెలిపారు. శుక్రవారం ఆయన వీవీ.రెడ్డి, పంజా మాలతితో కలిసి కార్యక్రమ వివరాలు వెల్లడించారు. తెలుగు, హిందీ భాషల్లోని సుమారు 400 మధుర గీతాలను 32 మంది గాయకులు ఆలపిస్తారని తెలిపారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైన 30 గంటల రికార్డును అధిగమించేలా 32 గంటల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం ఆదివారం రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు.

ఎవరికీ పట్టని ప్రత్యామ్నాయం

- ఒకే ఫీడర్‌తో తరచుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం
- ఇల్లెందు మున్సిపాలిటీ సహా ఆరు మండలాల్లో సమస్య
- పరిష్కారంపై పట్టింపు లేని అధికారులు, ప్రజా ప్రతినిధులు



ఇల్లెందులోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

ఇల్లెందురూరల్: ట్రాన్స్‌కో అధికారులు కాస్త దృష్టి సారిస్తే విద్యుత్ సరఫరాకు కలిగే అంతరాయాన్ని పరిష్కరించుకునే అవకాశం ఉంది. అయినా పట్టింపు లేనట్లుగా వ్యవహరిస్తుండటం.. ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయం దిశగా ఆలోచన చేయకపోవడం, ఇటు ప్రజాప్రతినిధులు సైతం విద్యుత్ సరఫరాలో అంతరాయంపై ఆరా తీయడం మర్చిపోయినట్లు తెలుస్తోంది. ఫలితంగా నెలలో రెండు నుంచి మూడు సార్లకు పైగా గంటల తరబడి అంతరాయం ఎదురవుతూ ప్రజలు అవస్థ పడుతున్నారు.

ఒక మున్సిపాలిటీ, ఆరు మండలాలు

ఖమ్మం జిల్లాలోని బూడిదంపాడు 400 కేవీ సబ్‌స్టేషన్ నుంచి ఇల్లెందు 132 కేవీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా జరుగుతోంది. ఇక్కడి నుంచి ఇల్లెందు మున్సిపాలిటీతో పాటు ఇల్లెందు, టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి, కారేపల్లి, కామేపల్లి మండలాల్లోని 130 కేవీ సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అయితే, బూడిదంపాడు నుంచి ఇల్లెందు 132 కేవీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేసేందుకు కేవలం ఒక ఫీడర్ ఉంది. రాష్ట్రంలో ఎక్కడైనా రెండు ఫీడర్లు ఉంటాయి. ఒక ఫీడర్‌లో సమస్య ఉత్పన్నమైతే రెండో ఫీడర్ ద్వారా సరఫరా చేయాలి. కానీ ఇల్లెందుకు మాత్రం ఒకే ఫీడర్ ద్వారానే సరఫరా కొనసాగుతోంది. తద్వారా ఫీడర్‌లో సమస్య ఏర్పడినప్పుడల్లా ఇల్లెందు మున్సిపాలిటీ సహా ఆరు మండలాల ప్రజలు ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తోంది.

అంతా చిరువ్యాపారులే..

నష్టాల భారం కారణంగా ఎప్పుడు మూతపడుతాయో తెలియని స్థితికి చేరుకున్న మూడు పెంకు పరిశ్రమలు మినహాయిస్తే ఇల్లెందు ట్రాన్స్‌కో సబ్‌డివిజన్ పరిధిలో ఎలాంటి పరిశ్రమ లేదు. వనరులు పుష్కలంగా ఉన్నా వంద మంది పనిచేసే ఒక్క పరిశ్రమలు ఏర్పాటు కాలేదు. కానీ విద్యుత్ ఆధారంగా చిన్నచిన్న దుకాణాలు, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆరు మండలాల పరిధిలో వేలాదిమంది ఉపాధి పొందుతున్నారు. నెలలో కనీసం మూడు, నాలుగు సార్లు బూడిదంపాడు నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటం వల్ల వారంతా తీవ్రంగా నష్టపోతున్నారు. వేసవిలో ఎండ వేడి, ఉక్కపోతతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఒకసారి రూ.కోటి వెచ్చిస్తే సరి

బూడిదంపాడు 400 కేవీ సబ్‌స్టేషన్ నుంచి ఇల్లెందు 132 కేవీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా కోసం అదనపు ఫీడర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం బూడిదంపాడు నుంచి ఇల్లెందు సబ్‌స్టేషన్ వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. అవే స్తంభాలకు మరోవైపు మరో ఫీడర్ ఏర్పాటు చేసే అవకాశముంది. ఇందుకోసం ట్రాన్స్‌కో రూ.కోటి మేర వెచ్చించాల్సి ఉంటుంది. ఒకసారి ఈ నిధులు కేటాయిస్తే ఎల్లవేళలా ఉపయోగపడుతుందని తెలిసినా పట్టించుకోని అధికారులు.. ప్రతీ నెల రూ.50 లక్షల మేర ఆదాయం కోల్పోతున్నా చూసీచూడనట్లు వదిలేస్తుండటం విమర్శలకు తావిస్తోంది

ఆదాయం కోల్పోతున్న ట్రాన్స్‌కో

అదనపు ఫీడర్ లేనికారణంగా బూడిదంపాడు నుంచి ఇల్లెందు 132 కేవీ సబ్‌స్టేషన్‌కు తరచూ విద్యుత్ సరఫరాలో గంటల తరబడి అంతరాయం ఏర్పడుతోంది. దీంతో నెలకు సుమారు రూ.50 లక్షల వరకు బిల్లును ట్రాన్స్‌కో కోల్పోతున్నట్లు సమాచారం. గత బుధవారం సైతం బూడిదంపాడు నుంచి ఇల్లెందు 132 కేవీ సబ్‌స్టేషన్‌కు ఐదు గంటలపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో ఒకేరోజు రూ.15 లక్షల వరకు విద్యుత్ బిల్లు ట్రాన్స్‌కో కోల్పోయినట్లు అధికారులు చెబుతున్నారు.

మరో ఫీడర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు



బూడిదంపాడు సబ్‌స్టేషన్ నుంచి ఇల్లెందు సబ్‌స్టేషన్ వరకు ప్రస్తుతం ఒకే ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతోంది. ఈ ఫీడర్‌లో సమస్య ఉత్పన్నమైతే సరఫరా నిలిచిపోతోంది. సమస్యను అధిగమించేందుకు అదనపు ఫీడర్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు విన్నవించాం.

–కోటేశ్వరరావు, ఏడీఈ, ఇల్లెందు సబ్‌డివిజన్

పంట మార్పిడితో అధిక దిగుబడి

- పురుగులు, కీటకాల నివారణ కూడా..
- భూసారం పెంపునకు తప్పనిసరి అని సూచిస్తున్న అధికారులు
- సీజన్ ప్రారంభమవుతుండటంతో రైతులకు విస్తృత అవగాహన



పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ తారాదేవి

కామేపల్లి: రైతులు ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడం ద్వారా తెగుళ్ల బెడద పెరిగి.. దిగుబడి తగ్గి నష్టాలు ఎదురవుతున్నాయి. అలాగే మొక్కలు భూమిలోని ఒకే లోతు పొరల నుంచి పోషకాలను స్వీకరిస్తుండటంతో పోషకాలు తగ్గిపోతున్నాయి. అందుకే రైతులు ఒకే రకమైన పంటలు కాకుండా తరచుగా మార్పిడి చేయాలని.. ఫలితంగా దిగుబడి పెరుగుతుందని వ్యవసాయాధికారులు చెబున్నారు. ఒకసారి వేసిన పంటను మళ్లీ కాకుండా ఇంకో పంట సాగు చేయాల్సిన ఆవశ్యకత, లాభాలపై అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

పంట మార్పిడితో లాభాలు..

ఒక పంటను ఒకే భూమిలో వరుసగా సాగు చేయడం వల్ల చీడపీడల ఉధృతి పెరుగుతుంది. పురుగు జీవిత చక్రం నిరాటకంగా ముగించుకుని ఎక్కువగా హానీ కలిగిస్తాయి. అలాకాకుండా పంట మార్పిడి చేస్తే పురుగు జీవిత చక్రం ఆగిపోతుంది. వేగంగా వృద్ధి చెందే కొన్ని రకాల పురుగులను పంట మార్పిడితో నివారించుకోవచ్చు. వాణిజ్య పంటలను మార్పిడి చేయకుండా సాగు చేస్తే ఒకే లోతు పొరల నుంచి పోషకాలు స్వీకరించడంతో నేల సారాన్ని కోల్పోతోంది. నేల భౌతిక స్వభావం దెబ్బతినకుండా, చీడపీడల అభివృద్ధిని నిరోధించడానికి పంట మార్పిడి తప్పనిసరి. అప్పుడప్పుడు పశుగ్రాసం కోసం గడ్డిజాతి పైర్లు పెంచడమే కాక భూసారాన్ని పెంచడానికి పశువుల ఎరువు వేయాలి.

పంట మార్పిడి ఇలా..

వరి తర్వాత మినుము, పెసర, శనగ వేయడం వల్ల సుడి దోమను నివారించుకోవచ్చు. వరిని సాగు చేసే పొలాల్లో ముందుగా పప్పు ధాన్యాలను సాగు చేయడం వల్ల నేల సారవంతమవుతుంది. పత్తి వేసిన పొలంలో జొన్న, మొక్కజొన్న, నువ్వులు, మినుము వేస్తే లద్దె, పచ్చ పురుగు నివారించుకోవచ్చు. వేరుశనగలో ఆకుముడతను నివారించేందుకు పప్పు జాతికి చెందిన పైర్లతో మార్పిడి చేయాలి. కంది, మిరప పంటల్లో ఎండు తెగులు నివారణకు జొన్న, మొక్కజొన్న పంటలతో మార్పిడి చేయాలి. నులి పురుగు సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో వేరుశనగ, మిరప, వంగ పంటలను కొన్ని పంట కాలాల పాటు సాగు చేయొద్దు. ఆహార పంటలైన వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ వంటి పంటలను పెసర, మినుము, వేరుశనగ పంటలతో మార్పిడి చేయాలి. ఆహార వాణిజ్య పంటలను పశుగ్రాస పైర్లతో ఒకసారి పప్పు జాతి పైర్లతో మరోసారి మార్పిడి చేయడం మంచిది.

విజయాలతో స్ఫూర్తిగా నిలవాలి



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖ గురుకుల డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తూ ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. కరకగూడెం మండలం గొల్లగూడెంనకు చెందిన పాయం ప్రవళిక సీఏటీ ఎంబీబీఏ కోర్సులో 66.44 శాతం, బూర్గంపాడు మండలం అంజనాపురానికి చెందిన బానోత్ స్వాతి ఐఐటీ జేఏఎం పీజీ గణితంలో 1,449వ ర్యాంకు, పినపాక మండలం అమరవరానికి చెందిన వజ్ర మానస ఐఐటీ జేఏఎం పీజీ ఫిజిక్స్‌లో 5,042 ర్యాంకుతో ప్రముఖ కళాశాలల్లో సీట్లు సాధించారు. ఈ నేపథ్యాన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను శుక్రవారం అభినందించిన పీఓ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో కళాశాలలకే కాక గ్రామం, తల్లిదండ్రులకు పేరు తీసుకురావడం ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం వారికి ఆయన ప్రోత్సాహక బహుమతులు అందించి ఉన్నత చదువులకు సహకరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో గురుకులాల ఆర్సీఓ వెంకటేశ్వరరాజు, ప్రిన్సిపాల్ రాజేశ్వరి, అధ్యాపకులు అనురాధ, సునీత, కృష్ణ, స్పందన పాల్గొన్నారు.

గ్లోబల్ సమ్మిట్‌లో జిల్లా రైతులు



సమ్మిట్‌లో పాల్గొన్న కేవీకే కోఆర్డినేటర్ రవికుమార్, రైతులు

ఖమ్మంవ్యవసాయం/వైరా: వరి ఎగుమతులపై హైదరాబాద్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ప్రపంచ స్థాయి సదస్సు (గ్లోబల్ రైస్ సమ్మిట్)లో ఖమ్మం జిల్లాకు చెందిన ఆదర్శ రైతులు పాల్గొన్నారు. వరికి ధర లభించడంతో పాటు మార్కెట్‌లో ఉన్న నిల్వల సమస్య పరిష్కారమే లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సును శుక్రవారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. 30కి పైగా దేశాలు, ఇతర రాష్ట్రాల వరి ఎగుమతిదారులు, శాస్త్రవేత్తలు, పరిశోధనా సంస్థల ప్రతినిధులతో పాటు జిల్లా నుంచి వైరా కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రవికుమార్, రైతుబంధు జిల్లా మాజీ కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, ఖమ్మం రూరల్ మండలం ముత్తగూడెం, నేలకొండపల్లి మండలం చెన్నారం, వైరా మండలం వల్లాపురానికి చెందిన ఆదర్శ రైతులు అనుమోలు రాంరెడ్డి, రామకృష్ణ, తుమ్మల రాణాప్రతాప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరి ఉత్పత్తి, నాణ్యత అంశాలపై చర్చించారు.